# సెప్టెంబర్ 11

ఆరోజు సెప్టెంబర్ 11వ తారీకు, 2001. అమెరికాలో ముందు నెలా, తరువాత తారీకు వ్రాస్తారు కనుక, అది 9 11.

ఆ రోజు కూడా మామూలుగానే తెల్లవారింది. న్యూయార్క్ సిటీలో, అందరూ రోజూలాగానే ప్రొద్దున్నే ఏడు గంటలకల్లా ఆఫీసులకి చేరారు.

అప్పటిదాకా బాగానే వుంది. అంతలోనే జరగరాని ఘోరం జరిగిపోయింది. అందరూ చూస్తుండగానే, అమెరికన్ ఎయిర్‌లైన్స్ వారి ఫ్లైట్ నెంబర్ 11,వరల్డ్ ట్రేడ్ సెంటర్ నార్త్ బిల్డింగ్ వేపుకి దూసుకువచ్చింది. రోడ్డు మీదా ఆ బిల్డింగ్‌లోనూ అందరూ చూస్తుండగానే, మతోన్మాదంతో మానవత్వాన్ని మంటగలుపుతూ ఆ బిల్డింగ్‌ని గుద్దుకుని కొన్ని వందల అమాయక ప్రాణాలను బలి తీసుకుంది. అప్పటి కప్పుడు చనిపోయినవారు చనిపోగా ఆ బిల్డింగ్‌లో పై అంతస్థులలో పని చేసుకుంటున్న మిగిలిన ఉద్యోగస్తులు నిర్ఘాంతపోయారు. ఏం జరుగుతున్నదో, ప్రాణాలతో బయటపడటానికి ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో అటూ ఇటూ పరుగెత్తటం మొదలుపెట్టారు. అప్పటికే అక్కడ వ్యాపించిన మంటలలో కూలి నెత్తిన పడుతున్న చెక్కలతో, రాళ్ళతో దిక్కుతోచక, ఇరవై అంతస్థుల పైనించీ కిటికీ అద్దాలని పగులగొట్టుకుని కిందికి దూకేశారు. ఎంతో ఎత్తైన చెట్ల మీదనించి రాలుతున్న పిట్టల్లా, లైటుకి తగిలి రాలిపోతున్న శలభాల్లా అంత ఎత్తునించీ నేలమీద పడ్డారు. ఎంతమందికి బుర్రలు చిలికిపోయాయో, ఎంతమందికి ఎముకలు విరిగిపోయాయో, ఎంతమంది మరణభయంతో కింద పడకుండానే గుండె ఆగి గాల్లో కలిసిపోయారో చెప్పుకోటానికి కూడా ఎవరూ మిగల్లేదు. ఇక క్రింది అంతస్థులవాళ్ళు ప్రాణభీతితో పరుగెడుతుంటే, వాళ్ళల్లో ఎంతమంది మీద ఆ భవంతి కూలి పడిందో, ఎంతమంది ఆ మృత్యుఘాతను తప్పించుకున్నారో, అంచనావేయటానికి కూడా సాధ్యపడలేదప్పుడు. అలాగే ఆ విమానంలో అసలేం జరిగిందో, ప్రయాణీకులు ఏ అనుభవాలకి లోనయారో, ఆ ఘాతుకచర్యలో ఎలా మరణించారో కూడా తెలీదు. కానీ అందరిలోనూ ఒకటే ప్రశ్న. "ఎందుకిలా జరిగింది?" అని.

ఇంతలోనే యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వారి ఫ్లైట్ నెంబర్ 175, వరల్డ్ ట్రేడ్ సెంటర్ దక్షిణ టవర్ని నేల కూల్చింది. మళ్ళీ సంభ్రమాశ్చర్యాలతో అదే కథ.

తర్వాత అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం పెంటగాన్ మీద పడితే ఇంకొక యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వారి విమానం పెన్సిల్వేనియాలో నేలకూలింది. ఆ విమానం వైట్‌హౌస్ కాపిటల్ బిల్డింగ్‌లవేపు వెడుతుంటే విమానంలోని సిబ్బంది ప్రయాణీకులతో కలిసి తమబలాన్ని ఉపయోగించి దారి తప్పించారని తర్వాత తెలిసింది. ఎన్నో వందల ప్రాణాలను బలి తీసుకున్న మానవత్వం లేని ఈ మతోన్మాదుల మతిలేని పనులు నిజంగా ఏ మతానికి సమ్మతం? అలా సమ్మతించే ఏ మతమైనా మతమనిపించుకుంటుందా? మరి మతం పేరుతో ఈ పనులు చేస్తుంటే, ఏదో కొద్దిమంది ఆ మత ప్రవ

క్తలు, ప్రబుద్ధులు అది ఖండిస్తూ పేపరు ప్రకటనలు ఇచ్చారు కానీ, ఇలాటి సంఘ విద్రోహక చర్యలను ఆపటానికి నిజంగా వాళ్ళు ఏంచేస్తున్నారు? ఒక్క భారతదేశం లోనే గత ముప్పై ఏళ్ళల్లో కనీసం యాభై వేల హిందువుల్ని నరికి పోగులు పెడితే మరి ఈ మత ప్రబుద్ధులు మాట్లాడలేదేం?

ఇవన్నీ అందరిలోనూ వున్న ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు జవాబులు చాల కొంత వరకే తెలిసినా, మానవత్వం విలువలని గౌరవించేవారికి దాని పూర్తి అర్థం అర్థం కాక పోయినా, ఇది మాత్రం కలలో కూడా నమ్మశక్యం కాని విషయం.

అందరిలాగా ఆ విషయమే తనుకూడా ఆలోచిస్తున్నది కాలిఫోర్నియాలోని ఒక భారతి. కథ కోసం మనం పేరు మార్చుకున్న ఇరవై ఐదేళ్ళ భారతి. అంతకు ముందే, బోస్టన్‌నించీ ఫోన్‌లో పిలిచాడు భారతి భర్త భరత్. ప్రపంచ హైటెక్ రంగస్థలం మీద ఒక పాత్రధారి. తన ఆశలనూ, ఆశయాలనూ, అటు సాంకేతిక రంగానికీ, ఇటు భారతి ప్రేమానురాగాలకూ అంకితం చేసిన భారతవంశీయుడు. అప్పటికే ఆఫీసు పనిమీద బోస్టన్ వెళ్ళి కొన్ని రోజులయిందేమో, భార్య మీద బెంగపడి త్వరగా ఆమెకి దగ్గరవాలనే ఆత్రుతతో తెల్లవారు ఝామునే ప్రయాణం కట్టిన సామాన్యుడు. ఇంటికి రాగానే భార్యకి ఇష్టమైన కొత్త రకం వంట తనే వండి పెడతానని ఆమెకు చెప్పిన కష్టసుఖాలు తెలిసిన భర్త. టీవీలో చూపించిన ఈ ఘాతుక చర్యలకి గురయిన విమానాల్లో తన భర్త వున్నాడేమోనని ఆమెకొక్క క్షణం ఏదో అనుమానంలాగా వచ్చినా అతను వెళ్ళింది బోస్టన్. ఇది జరిగింది న్యూయార్క్. కాబట్టి మళ్ళీ ఆమెకు ఆ తలపు రాలేదు. అదీకాక టీవీలో చూపించిన విమానం ఏదో చిన్న విమానమనీ తన భర్త వస్తున్నది అది కాదని అనుకున్నది. ఇంతలోనే ఆ వార్త.

బోస్టన్‌నించి బయల్దేరిన ఆ విమానంలోనే అతను వున్నాడనీ, ఆ విమానమే న్యూయార్క్‌లో ఆ బిల్డింగ్‌ని కూల్చటానికి ఒక బాంబులాగా వాడబడిందనీ తెలిసి, ఆవిడా, ఆవిడ ఆశలూ, ఆవిడ భవిష్యత్తూ ఒక్కసారిగా నేలకు ఒరిగిపోయాయి. ఆమెను పైచదువులు చదవమని ఎంతో ప్రోత్సాహించిన భర్త. ఆమెని యూనివర్సిటీలో చేర్పించిన భర్త. ఆమె భవిష్యత్తుని, ఆర్థికంగా అలా పటిష్టంచేద్దామనుకున్న భర్త. ఇక లేడు. భరించలేని ఈ దెబ్బకు ఆమె తట్టుకోలేకపోతుంటే ఆమె పక్కన అండగా నిలిచాడో విష్ణుమూర్తి. ఆమె చదువుతున్న యూనివర్సిటీలోనే పనిచేస్తున్న ఒక మంచి మనిషి. అమెరికా పద్ధతి ప్రకారం భర్తపోయిన తర్వాత ధైర్యం తెచ్చుకుని మామూలు జీవితం సాగించటానికి, సైకలాజికల్ కౌన్సెలింగ్‌కి వెళ్ళమంటే ఆమె నిరాకరించింది. భారతీయ పద్ధతిలో తనకు కావలసిన బంధువులు, స్నేహితులే తనకా బలమివ్వగలరని నమ్మింది. అందుకే మూర్తీ, ఆయన భార్యా, భారతి పక్కనే కొండంత అండగా నిలబడ్డారు. ఆమె తన భర్త ఆశయాలకు అనుగుణంగా చదువు కొనసాగిస్తేనే మంచి దనే నిర్ణయానికి వచ్చారు. తన భర్తను చిరకాలం గుర్తు పెట్టుకోవటానికి అతను ఎంతో ఆశ పెట్టుకున్న తన చదువు కొనసాగించటమే మంచి మార్గమంది. అదే తన జీవితాన్ని ధైర్యంగా ముందుకు నడిపిస్తుందని నమ్మింది.

"మనిషికీ మనిషికీ మధ్య విభేధాలు రావటం సహజమే కానీ, దానికి పరి

ష్కారం మాత్రం ఇది కాదు" అంది ఆమె ఈ సంఘ విద్రోహక చర్యల గురించి మాట్లాడుతూ. ఆమె వయసులోనూ, శారీరకంగానూ చిన్నదే అయినా ఆమెలోని కొండంత ధైర్యం చూసి మిత్రులందరికీ మంచి ధైర్యం వచ్చింది. చిమవులోపడి ఆమె మామూలు మనిషి అవుతున్నందుకు సంతోషించారు. అన్నీ మామూలుగా జరుగుతున్న సమయంలో ఒక గురువారంనాడు మిత్రులందరికీ ఫోన్ చేసి, ఎంతో స్నేహపూరితంగా పలకరించింది తనని ఆదుకున్న మూర్తిగారికి కూడా ఫోన్ చేసింది అంతా మామూలే ఏమీ తేడా కనపడలేదు

శుక్రవారం మధ్యాహ్నం యూనివర్సిటీలో పనిచేసుకుంటున్న మూర్తి గారిని పిలిచారు పోలీసులు ఆవిడ ఎపార్టుమెంట్‌కి వెంటనే రమ్మని. రాగానే అడిగాడు పోలీసాయన, "మృత దేహాన్ని గుర్తుపట్టగలరా" అని.

ఇంకా ఏదో ఆశ తొంగి చూస్తుంటే, అలాగేనని లోపలికి వచ్చాడాయన. భర్త పోయినా, అతని ఆశయాలను బ్రతికిద్దామనే తపనలోవున్న ఈవిడ ఇలాటి పని చేయదు. ఈవిడ అయివుండదు అని అనుకుంటూనే లోపలికి వెళ్ళాడు. కానీ అక్కడ ఆయన చూసింది, తన జన్మలో మరచిపోలేని దృశ్యం. సంఘటన మనసులోని బాధను ఆశతోనూ, మనిషిలోని ఆశను బాధతోనూ కథను చివరిదాకా నడిపించి సుఖాంతం చేయబోతే, అలా చేయలేకపోయిన ఘటన. మనిషినీ మనసునీ కదిలించే దుర్ఘటన. తన భర్త రోజూ ఎక్సర్‌సైజ్ చేసే మెషీన్‌కి నైలాన్ తాడుని కట్టి, దానికి ఉరి వేసుకున్న నిండు జీవితం.

కళ్ళ ముందరే కాలంలో కలిసిపోయిన లేత కనకాంబరం. వాడిపోయింది.

ఇప్పటికీ మూర్తిగారు అనుకుంటూనే వుంటాడు "ఆమె ఫోన్ చేసినరోజున, నాకు ఏమీ అనుమానం ఎందుకని రాలేదు. కొంచెమయినా అనుమానంవచ్చి ఆవిడ ఎపార్టుమెంట్‌కి నేను వెళ్ళివుంటే, ఏదన్నా సహాయం చేసి వుండేవాడినేమో. ఆమె బ్రతకటానికి ఆస్కారం వుండేదేమో"అని.

మనవాళ్ళు మనకి దూరమయినప్పుడు, మంచివాళ్ళందరూ ఎప్పుడూ అలాగే అనుకుంటారు నేను చేసిన దాంట్లో ఏమయినా లోపముందా వేరే ఏదయినా చేసివుంటే బాగుండేదా అని. అది వాళ్ళ మనసులోని బాధకీ, దూరమవుతున్న అనుబంధాలకీ సంకేతం.

ఈ 911 సంఘటన తర్వాత రోజూ పేపర్లోనూ టీవీలోనూ ఇలాటి వారి కథలెన్నో చదివాం, చూశాం. కానీ మానవత్వమున్న అందరి మనసుల్లో లాగానే నా మనసులోనూ ఇంకా ఆ ప్రశ్న మిగిలేవుంది.

"ఎందుకు జరిగిందిలా?" అని

కనీసం ఇలాటి ఘాతుక చర్యలు చేసేవారికైనా తెలుసా, ఎందుకు వాళ్ళు ఇలాటి పనులు చేస్తున్నారో?

* * *